క్లుప్తంగా

పరిసరాల శుభ్రతతో అంటువ్యాధులు దూరం


అవగాహన కల్పిస్తున్న సీహెచ్ఓ అనూరాధ

బైరెడ్డిపల్లె: అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం బైరెడ్డిపల్లె సచివాలయం వద్ద సీహెచ్ఓ అనూరాధ ప్రజలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం వలన అంటువ్యాధులు దరి చేరవన్నారు. ఆహారంలో తాజా కూరగాయలు, పండ్లు తీసుకోవాలన్నారు. మాతా–శిశుసంరక్షణ, కుటుంబ నియంత్రణ, వ్యాధి నిరోధక టీకాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పులిచెర్లకు చేరిన విద్యాకానుక కిట్లు


కిట్ల పార్శిళ్లను పరిశీలిస్తున్న ఎంఈఓ

పులిచెర్ల(కల్లూరు): మండలకేంద్రం పులిచెర్ల హైస్కూలుకు బుధవారం విద్యార్థులకు పంపిణీ చేయడానికి జగనన్న విద్యాకానుక కిట్లు వచ్చినట్లు ఎంఈఓ సిద్ధరామయ్య తెలిపారు. 1వ తరగతి నుంచి 10వతరగతి వరకు ఉన్న 2888 మంది విద్యార్థులకు యూనిఫాం వచ్చిందన్నారు. వీటిని త్వరలో పాఠశాలల వారీగా విద్యార్థులకు అందజేస్తామని ఆయన తెలిపారు.

సర్పంచ్ రాణెమ్మకు సన్మానం


పులిచెర్ల సర్పంచ్ రాణెమ్మ దంపతులను సన్మానిస్తున్న సచివాలయ సిబ్బంది

పులిచెర్ల(కల్లూరు): జిల్లాలో ఉత్తమ పంచాయతీగా ఎంపికైన పులిచెర్ల సర్పంచ్ రాణెమ్మ దంపతులకు బుధవారం పులిచెర్లలో సచివాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. పంచాయతీని అందరి సహకారంతో అన్నివిధాలా అభివృద్ధి చేశామని సర్పంచ్ తెలిపారు. రానున్న కాలంలో గ్రామాభివృద్ధికి అంతా సమష్టిగా కృషి చేద్దామని ఆమె తెలిపారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్



మద్యం విక్రేత అరెస్ట్ చూపుతున్న సీఐ యల్లయ్య, సిబ్బంది

గంగవరం: మండలంలోని కీలపట్లలో కర్ణాటక మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని ఎస్ఈబీ పోలీసులు అరెస్ట్ చేశారు. అందిన సమాచారం మేరకు ఎస్ఈబి సీఐ యల్లయ్య, సిబ్బందితో కీలపట్లలో దాడులు చేశారు. మద్యం విక్రయిస్తున్న కార్తీక్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి రూ. 15 వేల విలువ చేసే ఒరిజినల్ ఛాయిస్ టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

బాధ్యతలు చేపట్టిన చిన్నపిల్లల వైద్యుడు

పుంగనూరు: పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల చిన్నపిల్లల వైద్యుడిగా డాక్టర్ మధుసూదన్ ఆచారి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ భరత్‌ను పలమనేరుకు బదిలీ చేశారు. చిన్నపిల్లల ప్రత్యేక వైద్యుడు మధుసూదన్ ఆచారి మాట్లాడుతూ చిన్నపిల్లలకు ఎదురయ్యే ఆరోగ్య సమస్యలను పరిశీలించి, తగిన వైద్యసేవలు అందిస్తామని, ప్రభుత్వ వైద్యశాల సేవలను వినియోగించుకోవాలని కోరారు.

ఉపాధి పనుల పరిశీలన


ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పెద్దపంజాణి: మండలంలోని చలమంగళం పంచాయతీ కొత్తముద్దేపల్లె, ఒడ్డూరులో ఉపాధి హామీ పనులను బుధవారం ఎంపీడీఓ శ్రీనివాస విశ్వనాథ్ పరిశీలించారు.పని ప్రదేశాలలో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు, తాగునీరు, నీడ వసతి కల్పించాలని, పనిముట్లు అందజేయాలని ఎంపీడీఓను కూలీలు కోరారు. ఉన్నతాధికారులతో మాట్లాడి ఏర్పాటు చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో క్షేత్ర సహాయకులు కృష్ణ, మేట్లు దొరస్వామి, ఆనంద్, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మత్తులో యువత

- పలమనేరులో గుట్టుగా విక్రయాలు
- గంజాయి బీడి రూ.20, గంజాయి సిగరెట్ రూ.40
- వ్యసనపరులతో రోడ్డున పడుతున్న కుటుంబాలు
- పదుల సంఖ్యలో గంజాయి ఏజెంట్లు?


పలమనేరు పోలీసులు సీజ్ చేసిన గంజాయి(ఫైల్)

పలమనేరు: పలమనేరులో కొన్నాళ్లుగా గంజాయి వ్యాపారం గుట్టుచప్పుడు కాకుండా సాగుతోంది. కొందరు ఏజెంట్లు దీన్నే వ్యాపారంగా చేసుకుని లక్షలు గడిస్తున్నారు.పట్టణంలోని పలు ఇళ్లు, సమీప పొలాల వద్ద సైతం గంజాయి మొక్కలను రహస్యంగా సాగు చేస్తున్నారని ఇటీవలే పోలీసులు గుర్తించడం విదితమే. పోలీసులు గంజాయి విక్రేతలను అరెస్ట్ చేస్తున్నా సెబ్, పోలీసుల అధికారుల కళ్లు గప్పి కొందరు విక్రయిస్తున్నారు.

అనుమానం రాకుండా గంజాయి బీడీలు!

గంజాయిని సిగరెట్లు, బీడీలలో నింపి ఇక్కడ విక్రయిస్తున్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు,సెబ్ స్టేషన్ ఎదురుగా ఉన్న టీకొట్లు, ఆర్టీసి డిపో ప్రాంతం, మదనపల్లె రోడ్డులోని రెక్కమాను సర్కిల్, జండామతం, వారపు సంత, గాంధీనగర్, పోలీస్ లేన్ ప్రాంతాల్లో కొందరు గంజాయి అమ్మకాలు గుట్టుగా సాగిస్తున్నట్టు సమాచారం. ఈ ముఠా పట్టణంలోనే గాక నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లె, వి.కోట, కొలమాసనపల్లె, గంగవరం, బీడి కాలనీ, డ్రైవర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లోనూ గంజాయి సిగరెట్లను ఎక్కువగా విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. కళాశాల విద్యార్థులు, కూలీలు, డ్రైవర్లనే టార్గెట్ చేసుకుని విక్రయాలు చేస్తున్నట్టు సమాచారం.

బైపాస్‌లోనే అంతా..

పట్టణంలో కొందరు గంజాయి సిగరెట్లను తయారు చేసి అమ్మడమే వ్యాపారంగా పెట్టుకున్నారంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఉత్తరాంధ్ర నుంచి గంజాయి ఇక్కడి వివిధ రవాణా వాహనాల్లో చేరుతున్నట్టు ఇప్పటికే పోలీసులు గుర్తించారు. బైపాస్‌లో వేచి ఉండే ఏజెంట్ల సెల్‌ఫోన్ సమాచారంతో సరుకును తీసుకుంటున్నట్టు తెలుస్తోంది. ఏజెంట్ల నుంచి గంజాయిని తీసుకున్న కొందరు వ్యసనపరులు వాటి విత్తనాలను వారి ఇళ్ల వద్ద, పొలాల వద్ద వేసి రహస్యంగా మొక్కలను పెంచుతున్నట్టు భోగట్టా! ఈ మధ్యనే మండలంలోని చెత్తపెంటలో గంజాయి మొక్కలను సాగు చేస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకోవడం, అలాగే గతంలో ముసలిమొడుగు, వి.కోట, దేవదొడ్డి, కాలువపల్లె, క్రిష్ణాపురం తదితర ప్రాంతాల్లో గంజాయి మొక్కల సాగును ఎక్సైజ్ అధికారులు గుర్తించి ధ్వంసం చేయడం విదితమే.

రోజూ రూ.వేలల్లో వ్యాపారం

పట్టణ సమీపంలోని రొంటకుంట్ల రోడ్డు, గాంధీనగర్ వెనుకవైపు ఉన్న చెరువు, టీఎస్ అగ్రహారం సమీపంలోని గోరీ తోట, గంటావూరు కాలనీ, రాధాబంగ్లా తదితర ప్రాంతాల్లో స్థానిక ముఠా కొందరు ఏజెంట్లకు వీటిని అమ్ముతున్నట్టు తెలిసింది. గంజాయి బీడి రూ.20, సిగరెట్ రూ.40 ఇవిగాక పొట్లం రూ.100 వరకు అమ్ముతున్నట్టు తెలిసింది. పట్టణానికి చెందిన పలువురు యువకులు దీని మత్తుకు బానిసలై ఉన్మాదంతో ప్రవర్తిస్తున్నారు. ఇకనైనా దీనికి చెక్ పెట్టే దిశగా సెబ్ అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

> “
> **నిఘా పెట్టాం**
> ఇప్పటికే గంజాయి సరఫరా, సాగుపై స్థానిక పోలీసులతో కలసి పలువురు నిందితులను పట్టుకున్నాం. ఇక్కడికి ఎక్కడి నుంచి సరఫరా చేస్తున్నారు? స్థానికంగా ఎవరు విక్రయిస్తున్నారనే దానిపై నిఘా పెట్టాం.
> – ఎల్లయ్య, సెబ్ సీఐ, పలమనేరు

హనుమంత, గజ వాహనాలపై శ్రీనివాసుడి చిద్విలాసం

- మనోహరంగా వసంతోత్సవం


హనుమంత వాహనంపై కోనేటిరాయుడు

గంగవరం: కీలపట్లలో నిర్వహిస్తున్న కోనేటి రాయుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 6వ రోజు బుధవారం స్వర్ణాలంకార భూషితుడైన శ్రీనివాసుడు ఉదయం హనుమంత వాహనంపై, రాత్రి గజవాహనంపై గ్రామ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తొలుత ఆలయంలో స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి తోమాలసేవ, సహస్ర నామార్చన నిర్వహించిన అనంతరం శ్రీదేవి భూదేవి సమేత కోనేటిరాయుడు వసంత మండపంలోకి వేంచేశారు. వేడుకగా వసంతోత్సవం నిర్వహించారు. ఆ తర్వాత ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. భక్తజన బృందాలు, కోలాటాలు, సంకీర్తనల నడుమ వాహనసేవలు కోలాహలంగా సాగాయి. గురువారం ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహన సేవలు నిర్వహించనున్నట్లు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఎక్కువ కేసులు పరిష్కరిద్దాం

- సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు


న్యాయమూర్తి శ్రీనివాస రావు

పలమనేరు: పట్టణ సమీపంలోని ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలో ఈనెల 13న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించడానికి అధికారులు సహకరించాలని పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు కోరారు. స్థానిక కోర్టులో బుధవారం ఆయన డీఎస్పీ సుధాకర్ రెడ్డితో కలసి విలేకరులతో మాట్లాడారు. రాజీ మార్గమే రాజమార్గంగా భావించి కక్షిదారులు కేసులను రాజీ చేసుకోవాలన్నారు. ఇందులో ప్రి-లిటిగేషన్ కేసులను కూడా పరిష్కరించుకోవచ్చని, చెక్‌బౌన్స్, జీవనాధారం, వేధింపులు, గృహహింస తదితర సివిల్, క్రిమినల్ కేసులను రాజీ చేసుకోవడానికి ఇది మంచి అవకాశమన్నారు. లోక్ అదాలత్ తీర్పులపై అప్పీలు వెళ్లే అవకాశం కూడా ఉండదని స్పష్టం చేశారు.

ద్రౌపదీ అమ్మవారి ఉత్సవం


ఆలయం చుట్టూ ఊరేగిస్తున్న ద్రౌపది అమ్మవారి ఉత్సవం

గుడుపల్లె: మండలంలోని యామగానిపల్లెలో శ్రీ ద్రౌపదీ ధర్మరాజుల మహాభారత మహోత్సవాల సందర్భంగా బుధవారం ద్రౌపదీ అమ్మవారి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. పది రోజులుగా జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ముత్యాల పల్లకిలో ఉంచి ఆలయం చుట్టూ మంగళవాయిద్యాలతో ఊరేగించారు. చుట్టు పక్కల గ్రామాల భక్తులు విశేషంగా వచ్చి అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. రాత్రి కీచకవధ నాటకం ప్రదర్శించారు. ఆలయ ఆవరణలో గురువారం రథోత్సవం, అర్జునుడు ఆవులు తిప్పడం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

జెడ్పీటీసీకి పరామర్శ

బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లె జెడ్పీటీసీ సభ్యుడు ఆర్.కేశవులను బుధవారం చప్పిడిపల్లెలో మాజీ ఎమ్మెల్సీ రెడ్డెప్పరెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్యం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇటీవల ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ప్రమాదానికి గురై కేశవులు తీవ్రగాయాల పాలవడం విదితమే.

జనం గుండెల్లో సుస్థిర స్థానమే లక్ష్యం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే వెంకటేగౌడ


గొల్లచీమనపల్లెలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

బైరెడ్డిపల్లె : జనం గుండెల్లో సుస్థిర స్థానం పొందడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలన చేస్తున్నారని ఎమ్మెల్యే ఎస్.వెంకటేగౌడ అన్నారు. మండలంలోని గొల్లచీమనపల్లె, గడ్డిండ్లు, తావడకుప్పం గ్రామాల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. 460 పైచిలుకు గృహాలకు వెళ్లి ఆయా కుటుంబాల ప్రజలకు చేకూరిన సంక్షేమ లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు. ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఇళ్ల గోడలకు స్టిక్కర్లు అంటించడం తమ ప్రాధాన్యత కాదని, ప్రజల గుండెల్లో చెక్కు చెదరని స్థానం పొందడమే తమ లక్ష్యమని చెప్పారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో కులమతాలు, పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల వారికి వైఎస్సార్‌సీపీ పాలనలో ఆర్థిక భరోసా కల్పించారని నవరత్నాల పథకాలను ప్రస్తావించారు. అబద్ధపు హామీలతో ప్రజలను మళ్లీ వంచిస్తున్న మాజీ సీఎం చంద్రబాబునాయుడును ప్రజలు నమ్మరాదని కోరారు. రాబోయే రోజుల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించి మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కార్యదర్శి బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, వైస్ ఎంపీపీలు నారాయణస్వామి, రూప, సర్పంచులు ఝాన్సీలక్ష్మి, రమణారెడ్డి, చంద్రమౌళి, నారాయణరెడ్డి, బాలక్రిష్ణగౌడు, ఎంపీటీసీలు అభినవ్, వినాయకం, నాగరాజు, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ


ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు


వి.కోట: మండలంలోని ఎస్.బండపల్లె ఎస్సీ కాలనీలో శ్రీ గంగమాంబ దేవాలయ నిర్మాణానికి బుధవారం జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు,ఎంపీపీ యువరాజు భూమి పూజ చేశారు. శ్రీ వాణి ట్రస్ట్, టీటీడీ ఆర్థిక సహాయంతో సమరసత సేవా ఫౌండేషన్ దీనికి పూనుకుంది. ఆలయ నిర్మాణానికి వాణి ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.లక్ష విరాళమిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ డాక్టర్ తమీమ్, దేవరాజు నాయుడు, రఘుపతినాయుడు, ఆలయ కమిటీ చైర్మన్ సుబ్బన్న, మంజునాథ్, భాస్కర్‌నాయుడు, దొరస్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజలకు పారదర్శక వైద్యం అందిస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ శరణ్

పుంగనూరు: ప్రభుత్వాస్పత్రిలో 100 శాతం పారదర్శకతతో కూడిన వైద్యసేవలు అందిస్తామని పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రి కమిటీ చైర్మన్ డాక్టర్ శరణ్ తెలిపారు. బుధవారం మెడికల్ ఆఫీసర్ జశ్వంత్‌రాయల్‌తో కలసి కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వాస్పత్రిలో డాక్టర్లు, నర్సులు 24 గంటలు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలని సూచించారు. అలాగే విధుల్లో ఉన్న డాక్టర్లు, సిబ్బంది వివరాలు, వారి సెల్‌ఫోన్ నంబర్లు బోర్డులో ఏర్పాటు చేస్తామన్నారు. మందుల వివరాలను స్టాక్‌బోర్డులో చూపిస్తామన్నారు. ఆస్పత్రిలో మూలనపడిన వస్తువులను వేలం వేస్తామన్నారు. ఆస్పత్రికి కొత్త గేటును ఏర్పాటు చేస్తామన్నారు. అన్ని వార్డుల్లో పెయింటింగ్స్ వేసి ఆస్పత్రి వాతావరణాన్ని పూర్తిగా మార్చేస్తామన్నారు. డాక్టర్లు, సిబ్బంది ప్రజలకు నిత్యం వైద్యసేవలు అందించి ప్రభుత్వాస్పత్రికి గుర్తింపు వచ్చేలా కృషి చేయాలని కోరారు. సమావేశంలో కమిటీ సభ్యులు ఇనాయతుల్లా షరీఫ్, సీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

లాడ్జీలపై పోలీసుల దాడులు


గంగవరంలో..


కుప్పంలో..

గంగవరం: మండలంలోని లాడ్జీలపై ఎస్ఐ ప్రతాప్ రెడ్డి తన సిబ్బందితో బుధవారం దాడులు చేశారు. కర్ణాటకలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో సరిహద్దుకు ఆనుకుని ఉన్న మండలంలోని లాడ్జీల్లో పెద్ద మొత్తంలో నగదుతో అనుమానితులు బస చేస్తున్నట్టు సమాచారం వచ్చిందని, అందుకే లాడ్జీలలో తనిఖీలు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు. ఎవరైనా పెద్ద బ్యాగులు, గోనె సంచులతో లాడ్జీల్లో ప్రవేశించినా, అనుమానాస్పదంగా సంచరిస్తున్నా వెంటనే పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని లాడ్జీల నిర్వాహకులను ఆదేశించారు.

కుప్పంలో..

కుప్పం: పట్టణంలోని లాడ్జీలను కుప్పం పోలీసులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కర్ణాటకలో జరుగుతున్న ఎన్నికల దృష్ట్యా సరిహద్దుల్లోని కుప్పం లాడ్జీలను ప్రత్యేకంగా పరిశీలించారు. అనుమానిత వ్యక్తులు లాడ్జీల్లో గుర్తిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని యజమానులు, సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎస్ఐ శివకుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

కుప్పం నుంచి తిరువణ్ణామలై ప్రత్యేక బస్సులు

కుప్పం: పౌర్ణమి సందర్భంగా తమిళనాడులోని తిరువణ్ణామలైలో మహోత్సవాలకు వెళ్లే భక్తుల కోసం కుప్పం నుంచి ప్రత్యేకంగా రెండు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ స్వామి తెలిపారు. కుప్పం బస్టాండు నుంచి గురువారం మధ్యాహ్నం 3 గంటలకు, 4 గంటలకు ఈ బస్సులు బయలుదేరనున్నట్లు చెప్పారు. పౌర్ణమిని పురస్కరించుకుని గిరి ప్రదక్షిణలు చేసే భక్తులు ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

వృద్ధులకు కంటి పరీక్షలు


కంటి వెలుగు కార్యక్రమానికి హాజరైన నేతలు, అధికారులు

సదుం: మండలంలోని ఊటుపల్లె సచివాలయ పరిధిలోని చింతలవారిపల్లెలో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. అరవై ఏళ్లు పైబడిన 50 మంది వృద్ధులకు కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి కంటి అద్దాలు అందజేస్తామని అధికారులు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఆప్తమాలజిస్ట్ పెంచలయ్య, సర్పంచ్ రెడ్డెమ్మ, నారాయణరెడ్డి, సిబ్బంది విద్య, ఉదయభాస్కర్, నీలకంఠ, శారద, దళిత సంఘం నాయకుడు సీతాపతి పాల్గొన్నారు.

ఐడీలకు ఆధార్, మొబైల్ నంబర్ లింకు చేసుకోవాలి

పలమనేరు: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు విధిగా వారి సీఎఫ్ఎంఎస్ ఐడీకి ఆధార్ లింక్ చేసుకుని మొబైల్ నంబరుకు అనుసంధానం చేసుకోవాలని స్థానిక ఏపీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ నాయకులు గురురాజారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 10 లోపు దీనిని పూర్తి చేయాలని సూచించారు. పెన్షనర్ల సౌకర్యార్థం సంబంధిత ఎస్టీఓ కార్యాలయాల్లో ఈకేవైసీ సేవలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గంగమ్మకు అభిషేక పూజలు

పలమనేరు: పట్టణంలోని గంగమ్మ జాతరలో భాగంగా పట్టణంలోని విశ్వబ్రాహ్మణులు బుధవారం గంగమ్మకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులు పవిత్ర మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నివాళి


మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పెద్దపంజాణి: మండలంలోని నిడిగుంటకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మోహన్ రెడ్డి తల్లి గోవిందమ్మ వృద్ధాప్య సమస్యలతో మృతి చెందారు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆ గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీస్సులు

గంగవరం: మండలంలోని మేలుమాయికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సతీష్ వివాహం మంగళవారం జరిగింది. బుధవారం ఎమ్మెల్యే వెంకటేగౌడ నూతన వధూవరులను ఆశీర్వదించారు. పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం


ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

పలమనేరు: పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర భక్త మండలి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం బ్రహ్మర్షి పాఠశాలలో శ్రీనివాస కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణోత్సవానికి పెద్దసంఖ్యలో దంపతులు హాజరయ్యారు.

గాండ్లపల్లెలో 'ఫ్యామిలీ డాక్టర్'


సదుం: పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టరు గిరీష

సదుం: మండలంలోని పచ్చార్ల గాండ్లపల్లెలో బుధవారం ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమం నిర్వహించారు. డాక్టరు గిరీషా రోగులకు పరీక్షలు నిర్వహించారు. ప్రతి పంచాయతీ పరిధిలో నెలలో రెండు సార్లు కార్యక్రమం నిర్వహిస్తామని ఆమె చెప్పారు. 14 రకాల జబ్బులను పరీక్షించి, అవసరమైన వారికి 65 రకాల మందులను అందించడం జరుగుతుందన్నారు. దీర్ఘకాలిక రోగులకు, గర్భిణులకు పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది నీలకంఠ, ఉదయభాస్కర్, జానకి, భాగ్యలక్ష్మి, సీహెచ్ఓ శివాని పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వద్దు


ఆందోళన చేస్తున్న వామపక్షాల నాయకులు

పలమనేరు: ఆంధ్రుల హక్కుగా ఉన్న విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద వామపక్ష నేతలు ఆందోళన చేశారు. మానవ హారం ఏర్పాటు చేశారు. సీపీఎం నాయకులు ఓబుల్‌రాజు, సుబ్రమణ్యం మాట్లాడారు. లాభాల బాటలో ఉన్న ఉక్కు పరిశ్రమను కొందరు పారిశ్రామిక వేత్తల కోసం ప్రైవేటు పరం చేయడం సరికాదని, దీనిపై వామపక్షాల పోరాటం ఆగదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మంజునాథ్, గుర్రప్ప, హైదర్‌బాషా, ఐద్వా నాయకురాలు భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కాలువ ఆక్రమణల తొలగింపు


కాలువ ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

రామకుప్పం: రెండు దశాబ్దాలకు పైగా ఆక్రమణలలో ఉన్న కాలువకు ఎట్టకేలకు మోక్షం లభించింది. మండలంలోని బల్ల గ్రామం ఎస్సీ కాలనీలో గంగమ్మ గుడి ముందున్న కాలువను సుమారు 20 ఏళ్లుగా కొందరు ఆక్రమించుకున్నారు. ఈ ఆక్రమణలు తొలగించాలని గ్రామస్తులు పలుమార్లు అధికారులు, నాయకులకు వినతి పత్రాలు ఇచ్చినా ప్రయోజనం లేకపోయింది. గ్రామం నుంచి మురుగునీరు, వర్షపు నీరు వెళ్లే మార్గం ఆక్రమణకు గురవటంతో ఎక్కడికక్కడ నీరు నిలిచి సుమారు 200 కుటుంబాలు ఇబ్బందులు పడేవి. ఈ సమస్య పరిష్కారానికి చొరవ తీసుకున్న స్థానిక సర్పంచ్ విజయ్ థామస్ బుధవారం పంచాయతీ అధికారులు, గ్రామస్తులతో కలిసి ఆక్రమణలను తొలగించారు.